# సాక్షి

**లాయర్ మేహెర్న్** కళ్లజోడు ఓసారి సవరించుకొని, ఓ పొడిదగ్గు దగ్గి తనెదురుగా కూర్చున్న ముద్దాయికేసి చూశారు. సునిశితమైన ఆయన చూపులు బుద్ధి ఎంత తీక్షణమైనదో తెలుపుతాయి. తన క్లయింటుతో నిష్కర్షగా మాట్లాడడం ఆయన అలవాటు.

"అంత్యనిష్టూరం కంటే ఆదినిష్టూరం మేలన్నారు నీమీద మోపిన హత్యానేరం కేసు చాలా బలంగా ఉంది. నువ్వు చాలా అపాయంలో ఉన్నావని గ్రహిస్తే మంచిది"

గోడకేసి చూసి శూన్యదృక్కులతో చూస్తూ కూర్చున్న లియోనార్డ్ తనచూపు లాయరుకేసి తిప్పాడు.

"నాకర్థమయింది సార్. మీరు చెప్తూనే ఉన్నారు. అయినా నా మీద హత్యానేరం మోపబడిందంటే నేను నమ్మలేకపోతున్నాను. అదీ, ఇదీ కాదు ఏకంగా హత్య! అదీ నేను! మైగాడ్" అన్నాడు బాధగా.

మేహర్న్ చాలా ప్రాక్టికల్ మనిషి, ఓ దగ్గు దగ్గి కళ్లజోడు తీసి, తుడుచుకొని మళ్లీ పెట్టుకొని అనునయంగా చెప్పాడు.

"చూడు బాబూ, నీ బాధ నాకర్థమవుతోంది. నిన్ను కేసులోంచి బయటకు పడేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. కానీ కేసు యొక్క అన్ని వివరాలూ నాకు తెలియాలి. అప్పుడే మన డిఫెన్స్ పకడ్బందీగా ఉంటుంది. ఇది నా ఆఫీసు. పరాయివాళ్లు ఎవరూ లేరు. నిర్భయంగా అన్ని విషయాలూ చెప్పు"

• అన్నిటికీ ఆ యువకుడి చూపు మారలేదు. మొట్టమొదటిసారిగా మేహర్న్‌కి అనుమానం వచ్చింది. కొంపదీసి ఇతను నిర్దోషేమోనని.

"మీరు కూడా నేను హత్య చేశాననుకుంటున్నారుకదూ. నాకు తెలుసు, నా పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. నేనొక ఉచ్చులో ఇరుక్కుపోయాను. కానీ నన్ను నమ్మండి, నమ్మకపొండి, నేను హత్య చేయలేదు"

ఇటువంటి పరిస్థితుల్లో ప్రతివాడూ తను అమాయకుణ్ణని అనడం రివాజే. కానీ అతను నిజమే చెప్తున్నాడనిపించింది లాయర్‌కి. పైకి మాత్రం క్లుప్తంగా "ఇప్పటికైనా నీకు హతురాలైన మిస్ ఎమిలీతో పరిచయం ఎలా అయిందో, నువ్వీ కేసులో ఎలా ఇరుక్కున్నావో చెప్పడం ఆరంభించు" అన్నాడు.

"ఓరోజు ఆక్స్‌ఫర్డ్ స్ట్రీటులో ఓ అరవైయేళ్ల పెద్దావిడ రోడ్డు దాటుతుండగా చేతిలో పార్శిళ్లు పడేసుకుంది. ఆవిడ ఒంగి వాటిని ఏరుకుంటూండగా ఓ బస్సు మీదకొచ్చేసింది. ఆవిడ భయపడి పేవ్‌మెంటు మీదకు పరిగెత్తుకొచ్చేసింది. తక్కిన జనమంతా ఆవిణ్ణి కేకలేస్తూంటే నేను మాత్రం అవన్నీ ఏరుకొచ్చి దుమ్ము దులిపి జాగ్రత్తగా కట్టిఇచ్చాను"

"అంటే నువ్వు ఆవిడ ప్రాణం కాపాడలేదా?"

"అబ్బెబ్బే, అదేం లేదు. నేను చేసింది మామూలు మనిషి ఎవరైనా చేసేపనే. దానికే ఆవిడ చాలా సంతోషించి నాకు కృతజ్ఞతలు చెప్పి, ఈనాటి కుర్రకారులాటివాణ్ణి కానని అభినందించి వెళ్లిపోయింది. ఆవిణ్ణి మళ్లీ చూస్తానని అనుకోలేదు. కానీ కాకతాళీయంగా ఆ రోజు సాయంత్రమే ఓ స్నేహితుడింట్లో

ఎమ్బీయస్ ప్రసాద్

పార్టీలో ఆవిడని చూడడం సంభవించింది. ఆవిడే నన్ను గుర్తుపట్టి పలకరించింది. తనపేరు ఎమిలీ అనీ, క్రికెట్‌వుడ్‌లో నివసిస్తున్నాననీ చెప్పింది. కొంతమందికి ఒక్కొక్కప్పుడు కొంతమంది మీద అవ్యాజానురాగం కలుగుతుంది చూడండి. అటువంటి చాదస్తురాలే ననిపించింది. అంతగా పిలుస్తూంటే రాననడం అమర్యాదగా ఉంటుందని పై శనివారం వస్తానన్నాను. ఆవిడ వెళ్లిపోయాక ఆవిడ గురించి మా ఫ్రెండ్స్ చెప్పారు. ఆవిడో డబ్బున్న వృద్ధకన్య అనీ ఇంట్లో ఒక పనిమనిషీ ఎనిమిది పిలులున్నాయనీ.."

"ఆవిడ ధనవంతురాలని నీకు అప్పటికే తెలుసన్నమాట!"

"చూడండి, ప్రత్యేకంగా ఆవిడ డబ్బు గురించి అడిగే నేను వెళ్లాననుకుంటే మాత్రం" అని లియొనార్డ్ అంటూండగానే లాయర్ అతన్ని ఆపాడు.

"ఒక విషయం అర్థం చేసుకో. ప్రాసిక్యూషన్‌వాళ్లు కేసు ఎలా, ఎటువంటి దృక్కోణంలో చూస్తారో నేను ఊహిస్తున్నాను. మామూలుగా చూస్తే ఆవిడ అతిసాధారణంగా జీవించేది కాబట్టి, డబ్బున్న మనిషని ఎవరూ అనుకోరు. ఎవరైనా చెప్పివుంటే తప్ప నీకూ తెలిసేది కాదు. నీకు ఆవిడ డబ్బు గురించి చెప్పిందెవరు?"

"పార్టీ ఇచ్చాడన్నానే. జార్జి అని మా ఫ్రెండు, అతనే చెప్పాడు"

"అతని కా విషయం ఇప్పటిదాకా గుర్తుంటుందంటావా?"

"ఏమో మరి చాన్నాళ్లయిందికదా"

"సరిగ్గా చెప్పావు నీవు డబ్బు కోసమే ఆవిడతో స్నేహం చేశావని నిరూపించడానికి ప్రాసిక్యూషన్‌వారు ప్రయత్నిస్తారు. అప్పటికి నువ్వు చాలా ఇబ్బందుల్లో వున్నావట గదా"

లియోనార్డ్ మొహం ఎర్రబడింది "ఆ టైములో నాకు ఖర్మకాలి ఉందన్నమాట వాస్తవమే"

"అందుకే మరి! నీకు డబ్బు లేదు కాబట్టి ఆ ధనవంతురాలిని ఆకట్టుకొన్నావని వాళ్లంటారు. నీకు ఆవిడ ధనవంతురాలని ముందుగా తెలియనే తెలియదనీ, ఏదో పాపమని ఆవిణ్ణి చూడడానికి వెళ్లావనే మనం నిరూపించు కోగలిగేమనుకో..."



"...నేను వెళ్లినది మాత్రం అందుకే"

"నేను కాదనలేదు. కానీ ప్రాసిక్యూషన్ వాళ్లు ఒప్పుకోరుగా. జార్జి జ్ఞాపకశక్తి ఎంత గట్టిది? మనం అతన్ని బోనెక్కించి తికమకపెట్టేసి నీతో ఆవిడకి స్నేహం పెరిగిన తర్వాత ఆ సంభాషణ జరిగిందని అనిపించామనుకో..."

లియోనార్డ్ రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించి తల అడ్డంగా ఊపాడు. "అదేం లాభం లేదనుకొంటానండి. ఆవేళ అతనా మాటలన్నప్పుడు చాలామంది ఉన్నారు. ఒకల్లిద్దరు బంగారు పిచికను పట్టావంటూ నన్ను ఆటలు పట్టించారు కూడాను"

లాయరుగారు నిరాశపడినా ఒకందుకు సంతోషించాడు. "నువ్వు చెప్పింది నిజం. మనం ఆ దారి పట్టొద్దు సరే, విషయానికొద్దాం. నువ్వు ఎమిలీని కలుస్తూండేవాడివి. క్రమంగా మీ మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఎందుకు? దీనికి కారణం ఏమిటి? నీ వయస్సు

ముప్పైమూడు. అందగాడివి, ఆటా, పాటా నేర్చినవాడివి. ఓ అరవైయేళ్ల ముసలావిడతో అన్ని గంటలు కూర్చుని కబుర్లు చెప్పవలసిన అగత్యం ఏమొచ్చింది? నీ ఫ్రెండ్స్ దగ్గరకే వెళ్లచ్చుగా"

అతను భుజాలెగరేశాడు, "ఏమో నాకు తెలియదు. మొట్టమొదటిసారిగా వెళ్లినప్పుడు ఒంటరిజీవితం గడుపుతున్నాననీ, తరచుగా వస్తూండమనీ పట్టుబట్టింది. కాదనలేకపోయాను. నా మీద తనకున్న ప్రేమాభిమానాలను స్పష్టంగా కనబరిచేక 'నాకు కుదరదు' అని ఎలా అనగలను? అనడం నా నైజం కూడా కాదు. ఓ విషయం చెప్పమంటారా? ముందు మొహమాటంకొద్దీ వెళ్లినా, మూడు నాలుగు సార్లయ్యాక నా అంతట నేనే ఆవిడ దగ్గరికి వెళ్లనారంభించేను. మా అమ్మ నా చిన్నప్పుడే పోతే అత్త దగ్గర పెరిగాను. ఆవిడా పదిహేనవయేట పోయింది. అందుచేత ఎవరైనా పెద్దవాళ్లు ముద్దూ మురిపెం కనబరిస్తే నాకూ మహాసంతోషంగా ఉంటుంది. మీకు నవ్వొస్తోందేమో నా మాటలు విని..."

మేహెర్న్ నవ్వలేదు. సాలోచనగా కళ్లజోడు తీసి తుడవనారంభించాడు.

"నువ్వు చెప్పిందాంట్లో నమ్మదగనిది ఏమీలేదు. జ్యూరీ యెలా భావించినాసరే నువ్వు చెప్పినది మాత్రం అసాధారణం కాదు. కొట్టివేయలేం. సరే కథ కానీ. ఎమిలీ తన బిజినెస్ వ్యవహారాలు చూడమని మొదటిసారిగా ఎప్పుడడిగింది?"

"నేను నాలుగోసారి వాళ్లింటికి వెళ్లినప్పుడు. ఆవిడ డబ్బు వ్యవహారాలు ఏమీ తెలియవు. షేర్లలోకి పెట్టుబడులు ఎలా చేయాలని నన్నడిగింది"

"ఈ విషయం జాగ్రత్తగా ఆలోచించి చెప్పు. ఆవిడ దగ్గర పనిచేసే జేనెట్ తన యజమానురాలికి వ్యాపార సంబంధమైన లావాదేవీలు బాగా తెలుసనీ, ఆవిడే స్వయంగా అన్నీ చూసుకునేదని చెప్పింది. ఆవిడ బాంక్‌వాళ్లు కూడా అదే చెప్పారు"

"ఏమో మరి ఆవిడ నాకు చెప్పినది నేను మీకు చెప్తున్నాను."

మేహెర్న్ అతనికేసి పరీక్షగా చూశాడు. అతని నిర్దోషిత్వంపై ఆయనకు నమ్మకం బలపడింది. వృద్ధకన్యల సంగతి ఆయనకు బాగా తెలుసు. ఎమిలీ యితని మీద వ్యామోహపడి ఉంటుంది. అతన్ని తన ఇంటికి రప్పించుకోవడానికి కారణాలు వెతుకుతూ ఉండుంటుంది. డబ్బు వ్యవహారాలు తనకి ఏమీ తెలియవంటూ సహాయం అర్థిస్తే ఏ మగవాడు మురిసిపోడు? లేక బహుశా ఆవిడ కావాలనే తన ఐశ్వర్యం గురించి యితనికి ఆవిధంగా తెలియబరిచిందేమో! ఎమిలీ దృఢచిత్తురాలు కాబట్టి తనకేం కావాలో, అది ఎలా సాధించాలో, దానికి ఏం పణంగా పెట్టాలో తెలిసే చేసుంటుంది.

ఈ భావాలన్నీ మనసులోనే దాచుకొని మేహెర్న్ "ఇప్పుడు నిన్నొక ప్రశ్న అడగబోతున్నాను. మనస్ఫూర్తిగా నిజం చెప్పు. నీకు అప్పుడు డబ్బులేదు, ఎమిలీ వ్యాపారమంతా నీ చేతిలోకి వచ్చింది. నీ ఉద్దేశ్యం ప్రకారం ఆవిడకు ఈ సంగతులు ఏమీ తెలియవు. నువ్వు మోసం చేసినా ఆమె కనుక్కోలేదు. షేర్లు కొనడం, అమ్మడాలలో నీకేదైనా కలిసొచ్చేటట్టు వ్యవహరించావా?" అని అడిగేడు.

జవాబిచ్చేలోగానే అతన్ని వారించి "కాస్త ఆలోచించి జవాబియ్యి. మనం రెండు విధాలుగా డిఫెన్సు వాదించవచ్చు. మొదటిది నువ్వు నిజాయితీగా వ్యవహరించి ఉన్నావనుకో. ఈ విషయం మనం దండోరావేసి చెప్పి, నీ వంటి నిజాయితీపరుడు హత్య చేసి ఉండడని వాదించవచ్చు. ఒకవేళ నువ్వు ఏదైనా గోల్‌మాల్ చేసివుంటే ఖర్మకాలి అది ప్రాసిక్యూషన్ వాళ్లు దొరకబుచ్చుకుంటే అప్పుడు కూడా మనం నువ్వు హత్య చేయలేదని వాదించవచ్చు. బంగారు గుడ్లు పెట్టే బాతు నెవరు చంపుకొంటారు? ఆవిడ బతికుండగా మోసం చేసి సంపాదించే వీలుండగా ఆవిణ్ణి చంపవలసిన ఖర్మేముంది? అర్థమయిందా... అందుచేత నువ్వు కాస్త టైము తీసుకొని నేను చెప్పిన పాయింట్లు అర్థం చేసుకొని నిజం చెప్పడం మేలని గ్రహించు'

కానీ లియోనార్డ్‌కి ఆలోచించవలసిన అవసరమే లేకపోయింది. "నేను ఎమిలీ వ్యాపారం నడుపుతుండగా ఏ మోసమూ జరగలేదు. ఎవరైనా వచ్చి పరీక్షించవచ్చు. నా శక్తిసామర్థ్యాలన్నీ ఆమె బాగుకోసమే వినియోగించానని ఎవరైనా గ్రహించగలరు"

"చాలా సంతోషం. నా భారం తగ్గించావు"

"నిజానికి తరచి చూస్తే నా తరఫున ఉన్న గట్టి పాయింటేమిటంటే చంపాల్సిన అవసరం నాకు లేకపోవడం. ప్రాసిక్యూషన్ వాళ్లన్నట్లు ఒకవేళ నేను డబ్బు గురించే ఓ ముసలావిడకు మచ్చికయ్యేననుకొంటే, ఆవిడ చచ్చిపోవడం వలన నాకు ఆ ఆధారం పోయింది కదా! మరి ఆవిడని నేనెందుకు చంపాలి?"

లాయరు అతనికేసి చూస్తూ ఉండిపోయాడు. మళ్లీ కళ్లద్దాలు తీయడం, తుడవడం, యధాస్థానంలో ఉంచడం జరిగేకనే నోరు విప్పాడు. "ఎమిలీ తన విల్లులో ఆస్తంతా నీ పేర రాసిందని నీకు తెలియదా, లియోనార్డ్" అనడిగారు చివరికి.

ఇది వింటూనే అతను చటుక్కున లేచి నిలబడ్డాడు. "నిజంగానా? నా పేర విల్లు రాసిందా? మైగాడ్? ఎందుకు?"

లాయరుగారు తల ఊపారు. అతను తలకాయ చేతుల్లో పట్టుకొని కూలబడ్డాడు.

"నీకు విల్లు గురించి ఏమీ తెలియదంటావ్?"

"తెలియదు... అస్సలు తెలియదు... నాకెలా తెలుస్తుంది?"

"ఎమిలీ దగ్గిర పనిచేసే జేనెట్ తెలుసుగా. విల్లు విషయం నీకు తెలుసని ఆవిడ ఒట్టేసి చెప్తోంది. విల్లు తయారుచేయడం విషయంలో నిన్ను సంప్రదించానని ఎమిలీ ఆవిడకి చెప్పిందట. దీనికి నువ్వేమంటావ్?"

"అలా చెప్పిందా! సర్వాబద్ధం! పోన్లెండి. అంత మాటెందుకు? సంగతేమిటంటే జేనెట్ వృద్ధురాలు. యజమానురాల్ని అతివిశ్వాసంతో కొలుచుకుంది. నేనంటే ఎప్పుడూ పడేదికాదు. ఎమిలీ నాపై చూపించిన అభిమానానికి ఈవిడకి అసూయపుట్టింది. దానికి తోడు నామీద అపనమ్మకమొకటి. అసలేమయుంటుందంటే ఎమిలీ జేనెట్‌కి చెప్పి ఉండవచ్చు. జేనెట్ ఆవిడ చెప్పిన విషయం అపార్థం చేసుకొని ఉండవచ్చు. లేదా నేనే ఎమిలీని మభ్యపెట్టి విల్లు రాయించుకొని ఉంటానని అనుకొని ఉండవచ్చు. ఈ హత్య జరిగిన తర్వాత ఎమిలీ అలా చెప్పి ఉంటుందని తనని తనే నమ్మించుకుంటూ ఉండవచ్చు"

"ఒకవేళ కావాలనే అబద్ధం చెప్తోందేమోనని నీ కనిపించటం లేదా?"

అతను ఉలిక్కిపడ్డాడు. "ఛ ఛ! అలా ఎందుకు చెప్తుంది?"

"ఏమో! కానీ ఒకటి మాత్రం నిజం. నువ్వంటే మహామంటగా ఉంది"

వోల్ బాధతో మూలిగేడు. "నా మీద కేసు ఎంత పటిష్టంగా ఉందో నాకు క్రమంగా అర్థమవుతోంది. నేను ఆ ముసలావిడ ఎమిలీని వలలో వేసుకొని, ఆస్తంతా నా పేర రాయించేసుకొని ఓ రోజు ఎవ్వరూలేని సమయంలో ఇంట్లో దూరబడి ఆవిణ్ణి... మైగాడ్! నాకు ఆశ సన్నగిల్లిపోతోంది"

లాయరు అతని భుజం తడుతూ "ఇంట్లో ఎవరూ లేకపోలేదు! జేనెట్‌కి బయటకు వెళ్లే ప్రోగ్రాం ఉంది కదా! వెళ్లింది కానీ ఏదో మర్చిపోవడం వలన తొమ్మిదిన్నరకు ఇంటికి తిరిగివచ్చింది. దొడ్డి గుమ్మంద్వారా ప్రవేశించి మెట్లెక్కి పై అంతస్తులో ఉన్న తన వస్తువు తీసుకుపోతూంటే డ్రాయింగు రూములో ఇద్దరు మాట్లాడుకుంటున్నట్టు వినిదిట. వాళ్ల సంభాషణ అర్థం కాకపోయినా ఒక గొంతు ఎమిలీదని, వేరొకటి ఎవరో మగవాడిదనీ మాత్రం గ్రహించిందట."

"తొమ్మిదిన్నరకా?" అతను ఎగిరి గంతేశాడు. "తొమ్మిదిన్నరయితే నేను బతికిపోయేనన్నమాటే"

లాయరుకి మతిపోయింది "ఏమిటయ్యా విషయం?" అనడిగాడు తెల్లబోయి.

"నేను తొమ్మిదిన్నరవరకు ఇంట్లో ఉన్నానండీ బాబూ! మా ఆవిణ్ణి అడిగితే ఆవిడే చెప్పగలదు. నేను అయిదు నిమిషాలు తక్కువ తొమ్మిదికి ఎమిలీతో మాటలు ముగించి ఇంటిదారి పట్టి తొమ్మిదీ ఇరవైకల్లా ఇల్లు చేరాను. మా ఆవిడ నాకోసం ఎదురుచూస్తూ ఉంది. కాబట్టి టైమంత కరక్టుగా చెప్పగలను. హమ్మయ్య! జేనెట్ మతిమరుపు నాకు పనికొచ్చింది!"

తన సంతోషంలో లాయరుగారు పాలుపంచుకోవటం లేదన్న సంగతి అతనికి తట్టనేలేదు. అందుచేత "అయితే ఎమిలీని ఎవరు చంపారంటావ్?" అని ఆయనడిగిన ప్రశ్నకు హుషారుగా సమాధానం చెప్పేశాడు.

"ఇంకెవరు? ఎవరో దొంగాడు! కిటికీ తలుపు బలవంతంగా తెరిచినట్టు వుంది. ఆవిడ తలకాయను బద్దలు చేసిన ఇనప కమ్మీ శవం పక్కనే పడి ఉంది. చాలా వస్తువులు కనబడలేదు కూడా. ముందసలు పోలీసులతో సహా అందరు ఇది దొంగాడిపనే అనుకున్నారు కూడా. జేనెట్‌కు నా మీద ఉన్న అసూయ చేతనే నన్నిరికించారుగానీ"

"అదేం లాభంలేదు నాయనా! మిస్సయిన వస్తువులు విలువైనవి కావు. కిటికీ తలుపు మీద గుర్తులు కూడా... దీన్ని ఒక దొంగ చేసినట్టు చూపించడానికి ఏర్పాట్లు చేసినట్టుగా వుంది. నీకు నువ్వే ఆలోచించిచూడు. తొమ్మిదిన్నరకు ఎమిలీ మాట్లాడిందెవరితో? నువ్వు కాదు, సరే, దొంగాడా? దొంగలతో ముచ్చట్లాడుతూ కూచోరు కదా!"

అతను బిత్తరపోయాడు. పెదాలు తడారిపోయాయి. "అదీ నిజమే" అన్నాడు. కాస్సేపాగి "పోన్లే ఎవరైతే నాకేం! నాకు ఎలిబయ్ ఉంది. అది చాలు. మీరు మా ఆవిడ రొమైన్‌ని వెంటనే కలవండి, ప్లీజ్!" అన్నాడు.

"నువ్వు అరెస్టయినప్పుడు ఆవిడ ఊళ్లో లేకపోబట్టిగానీ లేకపోతే ఈ పాటికే కలిసి ఉండేవాణ్ణి. స్కాట్లండ్‌కి వైరిచ్చాను. ఇవాళ రాత్రే తిరిగి వస్తుందట. ఇక్కణ్ణుంచి సరాసరి మీ ఇంటికే వెళ్లి కలుస్తాను"

అతను తృప్తిగా తలూపాడు. "రొమైన్ సాక్ష్యం చెప్పగలదు. చూశారా?! ఎంత అదృష్టమో! ఎలిబయ్ ఉంది"

"ఒక్క నిమిషం, నీకు నీ భార్యంటే అంత ఇష్టమా?"

"నిస్సందేహంగా"

"ఆవిడకో?"

"రొమైన్‌కి నేనంటే ప్రాణం. నా కోసం దేనికైనా తెగిస్తుంది"

అతని ఉత్సాహం చూస్తుంటే లాయర్ గారి గుండెలు జారిపోయాయి. భర్తంటే అంత భక్తి శ్రద్ధలున్నామె సాక్ష్యం చెల్లుతుందాని ఆయన సందేహం.

"నువ్వు తొమ్మిదీ ఇరవైకి ఇంటి కొస్తుంటే వేరే ఎవరైనా చూశారా? అంటే పనిమనిషిలాటివాళ్లు."

"మాకు పనిమనిషే లేదు"

"కనీసం రోడ్డుమీద ఎవర్నైనా చూశావా?"

"నాకు తెలిసున్నవాళ్లెవరూ కనబడలేదవాళ. కొంతదూరం బస్సులో వచ్చాను. కండక్టరుకేమైనా గుర్తుంటుందేమో!"

లాయరు తల అడ్డంగా ఊపాడు. "మీ ఆవిడ తప్ప ఈ విషయం నిర్ధారించేందుకు సాక్షులెవరూ లేరంటావా?"

"లేరండి... ఏం మా ఆవిడ సాక్ష్యం చాలదంటారా?" అన్నాడు అతను సందేహంగా.

"అబ్బే అలా అని కాదు" అంటూ "సరే అదలా ఉంచు. నువ్వు వివాహితుడవని ఎమిలీకి తెలుసా?"

"ఓ, తెలుసే!"

"అయినా నువ్వు నీ భార్యని ఒక్కసారి కూడా ఆవిడ దగ్గరకి తీసుకెళ్లలేదేం?"

ఆనాటి సంభాషణలో మొట్టమొదటిసారిగా అతని గొంతు వణికింది. "ఆ మాట నిజమే... కారణం నాకూ తెలియదు"

"జేనెట్ ఏమంటోందో తెలుసా? నువ్వు బ్రహ్మచారివనే అభిప్రాయంతో ఎమిలీ నిన్ను పెళ్లి చేసుకొనే ఉద్దేశ్యంలో ఉందని చెప్తోంది"

లియోనార్డ్ పగలబడి నవ్వాడు. "చాలా అందంగా ఉంది! మా ఇద్దరి మధ్యా ముప్ఫై ఏళ్ల తేడా

ఉంది తెలుసా?"

"ఆ తేడాతో కూడా పెళ్లిళ్లు చేసుకున్నవాళ్లున్నారు. అది సరే... మీ ఆవిడ ఎమిలీని ఒక్కసారి కూడా కలవలేదు. అవునా? కాదా?"

"అవుననుకోండి"

"ఈ విషయంలో నీ పద్ధతి కాస్త వింతగా ఉందని చెప్పక తప్పదు" అన్నాడు లాయర్ నిష్కర్షగా.

అతని మొహం ఎర్రబడింది. ముందు తొట్రుపడినా తర్వాత చెప్పుకొచ్చాడు. "ఉన్న విషయం చెప్పేస్తాను. నా దగ్గర డబ్బులేదు. ఎమిలీ అప్పిస్తుందేమోనని ఆశపడ్డాను. ఆవిడకు నేనంటే ఇష్టమే కానీ మా కష్టాల గురించి వినే ఓపిక ఆవిడకి లేదు. నేనూ మా ఆవిడా పోట్లాడుకున్నామనీ విడివిడిగా ఉంటున్నామనీ ఆవిడ పొరపాటు పడింది. అది నేను గ్రహించినా ఆవిడకు ఎప్పుడూ నిజం ఇదీ అని చెప్పలేదు. చూడండి లాయరుగారూ! నేనేం చేసినా నా భార్య రొమైన్ గురించే చేశాను. ఈ విషయంలో మౌనం వహించడమొకటే నేను చేశాను. ఆవిడ నన్ను కొడుకుగా భావిస్తున్నాననేది. అంతే కానీ నన్ను పెళ్లాడాలనుకొనేది వట్టిమాట, జేనెట్ ఊహాగానం"

"అంతేనంటావా?"

"ముమ్మాటికీ అంతే"

'అతని మాటల్లో కాస్త తటపటాయింపు ఉందా, లేక తన ఊహేనా?' అనుకున్నాడు లాయరు. "నా శాయశక్తులా ప్రయత్నించి నిన్ను రక్షిస్తాను" వెళ్లిరా లియొనార్డ్ అన్నాడు ధైర్యం చెబుతూ.

"జేనెట్ చెప్పిన దానిపై చాలా ఆధారపడి ఉంటుంది. ఆమెకు నిన్ను చూస్తే తగనిమంట" అనేసి బయటకు నడిచేడు.

ఇంటికి వెళ్లాడు మేహర్న్. ఏబ్రాసిలా ఉన్న పనిమనిషి తలుపు తీసింది.

"లియొనార్డ్ భార్య ఊర్నించి తిరిగొచ్చారా?" అనడిగేడు.

"వచ్చి గంటయింది. ఇప్పుడెవర్నీ కలవరేమో!"

"నా కార్డు ఇయ్యి ముందు" అంటూ ఆమె చేతికి విజిటింగు కార్డిచ్చాడు మేహెర్న్. కాస్సేపటిలో బయటకొచ్చి "రమ్మన్నారు" అంది.

రొమైన్ సన్నగా పాలిపోయి ఉంది. దవడ ఎముకలు ప్రస్ఫుటంగా తెలుస్తున్నాయి. ఒత్తైన జుట్టు, చేతుల కదలిక వల్ల ఆమె విదేశీ వనిత అన్న విషయం తెలుస్తోంది. ఆమె వస్తూనే "మీరు మా వారి లాయరు కదూ, ఆయన్ని చూసి వస్తున్నారా? ఎలా ఉన్నారు?" అంది.

"చూడండి, కంగారు పడవద్దు..." అంటూ ఆరంభించిన లాయరు సగంలోనే ఆగిపోయాడు. రొమైన్ మొహంలో ఏ ఆందోళనా లేదు. నిశ్చలంగా ఉంది. భయం కొలిపేటంతటి నిశ్చలత్వం.

"నేనేమైపోతానోనని దిగులుపడకండి. సంగతులన్నీ చెప్పండి" అని కొద్దిసేపు ఆగి గొంతు తగ్గించి... "ఎంత దుర్భరమైన, నిష్ఠూరమైన నిజమైనా సరే" అంది.

మేహెర్న్ లియొనార్డ్‌తో జరిగిన తన సంభాషణంతా చెప్పుకొచ్చాడు. ఆమె అతి శ్రద్ధగా వింది. అంతా అయ్యేక "అయితే ఆ రోజు రాత్రి 9.20కి ఆయన ఇంటికి వచ్చినట్లు సాక్ష్యం పలకమంటాడన్నమాట"

"అతనా టైముకి నిజంగా వచ్చాడు కదూ" అన్నాడు లాయరుగారు ఆదుర్దాగా.

రొమైన్ తొణక్కుండా "అదికాదు అసలు సంగతి. నేనలా చెబితే ఆయన్ను వదిలేస్తారా? ఆ విషయం చెప్పండి చాలు"

లాయరు ఆమె అతి చురుగ్గా విషయం గ్రహించినందుకు అదిరిపోయాడు.

".... చెప్పండి. నా సాక్ష్యం చాల్తుందా? నేను కాక వేరెవరైనా సాక్షులున్నారా?"

ఆమె ఆదుర్దా చూసి లాయర్ ఇబ్బందిగా కదిలేడు. "మీరు తప్ప వేరే సాక్షులెవరూ లేరు" అన్నాడు నెమ్మదిగా.

"అలాగా" అందామె. ఒకటి, రెండు నిమిషాల తర్వాత ఆమె పెదాలపై చిరునవ్వు మొలిచింది.

లాయరుకు బెదురు ఆరంభమయింది. "మీ మనస్సులో ఏముందో నాకు తెలుసు" అనబోతూండగానే ఆమె "మీకు నిజంగా తెలుసా?" అంటూ నవ్వింది.

"మీరు మానసికంగా చాలా అలసిపోయున్నారు. భర్తని ఆరాధించే మీవంటి..."

చురుగ్గా ఆమె చూసిన చూపు అతన్ని కలవరపెట్టింది. ధైర్యం కూడదీసుకుని మళ్లీ ఆరంభించేడు. "భర్తని ఆరాధించే.."

"అలాగని మా ఆయన చెప్పారా?" అని వెటకారంగా ఓ నవ్వు నవ్వి "చెప్పినా ఆశ్చర్యం లేదు. మగవాళ్లొట్టి మూర్ఖులు" అంటూ చటుక్కున లేచి నిలబడింది. "అతనంటే నాకు మహా అసహ్యం, తెలుసా, పరమ అసహ్యం. అతను ఉరికంబం నుండి వేలాడుతుంటే చూడాలని నా ఆశ తెలుసా! అంత అసహ్యం నాకు" అంటూ ఉద్రేకంగా అరవసాగింది.

లాయరుగారు తెల్లబోయాడు. ఎంత కసిరా బాబూ అనిపించిందాయనకు.

"అవును... అతను ఉరికంబంపై వేలాడుతూండగా నేను చూడడం ఖాయం. అతను ఇంటికి తొమ్మిదీ ఇరవైకి కాక పది ఇరవైకి వచ్చాడని కోర్టులో నేను సాక్ష్యం చెప్పాననుకో! ఏమవుతుంది? అతను తొమ్మిది ఇరవైకే వచ్చినట్టు చెప్పడానికి వేరే సాక్షులెవరూ లేరని మీరే చెప్పారు! విల్లు సంగతి తెలీదంటున్నాడుగా అతను. అతనికి తెలుసనీ, డబ్బు కోసమే ముసలామెను చంపుతానని నాతో అన్నాడనీ నేను చెబితే? రాత్రి తిరిగొచ్చి హత్య చేసినట్టు నాకు చెప్పాడనీ, కోటుమీద రక్తం ఉందనీ నేను సాక్ష్యం ఇస్తే...?"

ఆమె చూపులు లాయరును సవాలు చేస్తున్నట్లున్నాయి. ఇవన్నీ ఈమె వద్ద ఎందుకు చెప్పానా అని లోపల బాధపడుతూనే పైకి బింకంగా "నీ భర్తకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వలేవు" అన్నాడు.

"అతను నా భర్తయితే కదా!"

"ఆఁ"

"అవును, లియొనార్డ్ నా భర్తకాదు. నేను వియన్నాలో నాటకాల్లో వేషాలు వేస్తూండగా అతను పరిచయమయ్యాడు. నా భర్త పిచ్చాసుపత్రిలో ఉన్నాడు. ఆయన బతికుండగా వేరే పెళ్లి చేసుకున్నా చెల్లదు కాబట్టి మేం పెళ్లి చేసుకోలేదు. ఏది జరిగినా మన మంచికేననిపిస్తోంది ఇప్పుడు"

మేహెర్న్‌కి లోకం గిర్రున తిరిగినట్లయింది. పైకి ఏమీ చలించనట్లుగా మొహం పెట్టి "లియోనార్డ్‌పై నీకంత ద్వేషం దేనికి?" అన్నాడు.

ఆమె తల అడ్డంగా తిప్పింది. "చెప్పనుగాక చెప్పను. నా రహస్యాలు ఇంకొకళ్లకు ఎందుకు చెప్పాలి?"

మేహెర్న్ చేసేదేమీ లేక పొడి దగ్గొకటి దగ్గి లేచి నిలబడ్డాడు. అతను బయటకు వెళుతూండగా ఆమె అతని దగ్గరకు వచ్చి కళ్లలో కళ్లుపెట్టి "నిజంగా చెప్పండి అతను నేరం చేయలేదనే మీరు నమ్ముతున్నారా?" అంది.

"అంతకుముందు ఏదైనా సందేహం ఉంటే నీతో మాట్లాడిన తర్వాత అది తీరిపోయింది. అతను నిశ్చయంగా నిరపరాధే" అన్నాడతను కర్కశంగా.

రోడ్డుమీద నడుస్తున్నాడే కానీ ఆమె నవ్వు అతన్ని వెంటాడుతోంది. తెగిస్తే ఆడవాళ్లంత క్రూరులు మరొకరుండరు. పాపం ఈ దౌర్భాగ్యుడికి అందరూ వ్యతిరేకులే.

పోలీసు కోర్టు విచారణ క్లుప్తంగానే ముగిసింది. ప్రాసిక్యూషన్ సాక్షులిద్దరు - జేనెట్, రొమైన్! రొమైన్ అన్నంత పనీ చేసింది. లియొనార్డ్ హత్యచేశాడని బల్లగుద్ది చెప్పింది.

కోర్టు డిఫెన్స్ వాదనకై వాయిదా పడింది కానీ మేహెర్న్‌కి ఏం చెయ్యాలో పాలుపోలేదు. రొమైన్‌ని బెదరగొట్టి ఆమె సాక్ష్యాన్ని నిరుపయోగం చేయడం అసాధ్యం. తనే ఆమెకు అన్ని పాయింట్లూ పువ్వుల్లో పెట్టి సమర్పించుకొన్నాడు. ఆలోచించగా ఎమిలీ ఇంట్లో రాత్రి తొమ్మిది గంటలకు మాట్లాడిన వ్యక్తి

ఎవరో కనుక్కుంటే వోల్‌ను రక్షించవచ్చనిపించింది. విచారించగా ఎమిలీకి ఓ మేనల్లుడు ఉండేవాడనీ, అతను ఎమిలీని బెదిరించి, బెల్లించి డబ్బు పట్టుకుపోతూండేవాడనీ తెలిసింది. జేనెట్‌కు అతనంటే అభిమానమనీ ఎమిలీకి అతని తరఫున సిఫార్సులు చేసేదనీ కూడా తెలిసింది. ఆ తొమ్మిది గంటల వ్యక్తి ఈ మేనల్లుడేనని నిరూపించగలిగితే?

ఏమీ లాభం లేకపోయింది. ఆ మేనల్లుడి అనుపానులు తెలియలేదు. ఏ పరాయి వ్యక్తీ ఎమిలీ ఇంటికి వచ్చినట్టూ, వెళ్లినట్టూ చూసిన వారెవరూ లేరు. అలాగే లియొనార్డ్ ఎమిలీ ఇల్లు విడిచిపెట్టడం కానీ, తన ఇంటికి వెళ్లడంగానీ చూసిన సాక్ష్యులూ లేరు.

ఇక చేతులెత్తేయబోతూంటే ఓ రోజు ఆరుగంటల పోస్టులో ఓ ఉత్తరం వచ్చింది. ఓ మురికి కవరు, అడ్డందిడ్డంగా అంటించిన స్టాంపు, చదువు వచ్చీ రానివాళ్లు రాసిన అడ్రసు.

"ఇదిగో మిస్టర్,

ఆ లియొనార్డ్‌కి వకీలు నువ్వేగదా. ఆ రొమైను చెప్పేవన్నీ అబద్ధాలు. అవి తెలుసుకోవాలంటే ఇవాళ రాత్రి షారెంట్సులో 16 నెంబరు ఇంటికి వచ్చి మిసెస్సు యెగ్‌సన్ ఎక్కడని అడుగు. ఖర్చు రొండువందలు అవుతుంది"

ఒకటికి రెండుసార్లు చదివేక లాయరుకు విషయం బోధపడింది. ఎవ్వరైనా తమాషాకి రాసేరేమోనని ఒకట్టేయబోయాడు. కానీ ఒకవేళ కొంపదీసి నిజమే అయితే? కేసు ఇంతకన్న మునగబోయేది లేదు. పోయి చూస్తే సరి.

షారెంట్స్ ఓ మురికి కూపం. కంపుకొట్టే ఇళ్లు. కష్టపడి వెతికి పట్టుకున్నాడు. మిసెస్ యెగ్‌సన్ మూడో అంతస్తు వాటాలో ఉందంటే వెళ్లి తలుపుతట్టాడు.

రెండోసారి కొట్టినప్పుడు తలుపు జాగ్రత్తగా తెరుచుకొని ఓ ముసలావిడ తొంగిచూసింది. లాయర్ని చూడగానే "ఒచ్చావా? రా, రా" అంటూ తలుపు బార్లా తెరిచింది. ఉబ్బసంతో గుర్రుగుర్రు మంటూ "నువ్వొక్కడివే కదా, ఎవర్నైనా వెంటేసుకొచ్చావా? మందగ్గిర ఆటలు సాగవ్" అని నవ్వింది.

లాయర్ సంకోచిస్తూనే గదిలోకి అడుగుపెట్టాడు. చిన్న గది. బట్టలు అక్కడా ఇక్కడా పడి ఉన్నాయి. విరిగిపోయిన బల్ల, ఊగుతున్న కుర్చీలు, ఓ మూల సరిగ్గా మండని పొయ్యి. పొగతో మండే కళ్లు చించుకొని ముసలిదానికేసి చూశాడు. ఆమె మరీ అంత ముసలిది కాదు. నడివయస్కురాలే. నడుం ఒంగింది. జుట్టు ముగ్గుబుట్టలా ఉంది. మెడచుట్టూ స్కార్ఫ్ చుట్టుకుని ఉంది. లాయరు శల్య పరీక్ష చూసి ఆమె నవ్వింది.

"అందాలన్నీ దాచేసుకుందేంట్రాని చూస్తున్నావా? హీ, హీ... చూస్తే నువ్వు మూర్ఛపోతావని! చూపియ్యనా?" అంటూ చటుక్కున స్కార్ఫ్ విప్పిపారేసింది. భయంకరమైన మాంసం ముద్దచూసి లాయరుకి ఒడలు గగుర్పొడిచింది. ఆమె వెంటనే స్కార్ఫ్ చుట్టేసుకొంది.

"ఏం అందంగా ముద్దిచ్చేట్టులేనా? హీ, హీ... అవునుమరి. నేనూ ఒకప్పుడు చూడచక్కగానే ఉండేధాన్ని. ఏసిడ్, తెలుసుగా... ఏసిడ్ పోసేశాడు దొంగచచ్చినాడు..."

ఆమె బూతులు కర్ణకఠోరంగా ఉన్నాయి. లాయరు ఆపబోయాడు కానీ లాభం లేకపోయింది. కాస్సేపు తిట్టాక అలసటతో ఆమె ఆగింది. గుప్పిళ్లు మూస్తూ తెరుస్తూ రొప్పుతోంది.

"ఈ గోల చాలిక. నువ్వేదో నా క్లయింటుకు సహాయపడే సమాచారం ఇస్తావని వస్తే ఇదంతా ఏమిటి?" అన్నాడు మేహెర్న్ చివరికి.

"ఇస్తాలే. మరి డబ్బో" అందామె బొంగురు గొంతుతో.

"చూడు సాక్ష్యం చెప్పడం నీ విధి. తెలుసా?

"చాల్లే, నీతులు చెప్పకు, నేనడిగిన డబ్బిస్తే నీక్కొన్ని అయిడియాలు చెప్తాను సరేనా?"

"ఎటువంటి అయిడియా?"

"ఓ ఉత్తరం అనుకో. ఆ రొమైన్ రాసిన ఉత్తరం. నాకెలా వచ్చిందని అడగకు. డబ్బక్కడపెట్టి

మాట్లాడు"

మేహెర్న్ ఆమెకేసి సాలోచనగా చూసి "పది పౌండ్లిస్తాను పైన చిల్లిగవ్వ ఇవ్వను. అదైనా నువ్వంటున్న ఆ ఉత్తరం నాకిస్తేనే"

"ముష్టి పది పౌన్లా?" ముసల్ది తిట్లు లంకించుకొంది.

"సరే ఆఖరిమాటగా ఇరవై" అన్నాడు మేహెర్న్. లేచి నిలబడ్డాడు. డబ్బు తీసి లెక్కపెట్టడం మొదలెట్టాడు.

డబ్బు చూసి ముసల్ది ఒగర్చడం మొదలుపెట్టింది. తిట్టుకుంది, తిమ్ముకుంది. చివరికి పరుపు కిందనుండి ఓ ఉత్తరాల కట్ట విసిరేసింది. "నీక్కావల్సింది పైనుంది. పట్టుకుపో' అంది.

మేహెర్న్ అతిశాంతంగా ఉత్తరాలన్నీ చదివాడు. అవి రొమైన్ తన ప్రియుడికి రాసిన ప్రేమలేఖలు. పైనున్న ఉత్తరం లియోనార్డ్ అరెస్టయిన నాటిది.

"నే చెప్పింది కరెక్టేనా? ఆ రొమైన్ పని అయిపోతుంది పోర్ది కదూ దీన్తో" అందామె.

మేహెర్న్ ఆ ఉత్తరాలన్నీ జేబులో పెట్టుకొని, "ఇవన్నీ నీకెక్కడివి?" అన్నాడు.

"అది నీకెందుకు? ఇంకోటి చెప్పనా? పదీ ఇరవైకి ఆవిడ ఇంట్లో ఉన్నానంది కదా! లయన్ సినిమా హాలుకెళ్లడుగు, తెలిసిపోతుంది. కొట్టొచ్చినట్టు కనబడుతుంది. గుర్తుంటుందిలే వాళ్లకి!!

"ఇంతకీ ఈ ఉత్తరాల్లో మనిషెవడు?"

ముసలిదాని గొంతు ఇంకా బొంగురుపోయింది. గుప్పిళ్లు మూసి, తెరిచి కొద్దిసేపు గడిపింది. చివరికి తలెత్తింది.

"వాడే నా మొహాన్ని ఇలా చేసినవాడు. చాలా కాలమైందిలే. అదొచ్చి... అదే రొమైన్... నావాణ్ణి ఎగరేసుకుపోయింది. నేను వాణ్ని ఒదిలిపెట్టలేదు. వెంటబడ్డా! అప్పుడు ఏసిడ్ పోసేశాడు నా మొఖంమీద. అదే ఉసిగొల్పి ఉంటుంది. నా మొఖం కాలిపోతోంటే నవ్వింది అది. నేను పగ విడిచిపెట్టేదాన్ని కాదు. వెంటాడాను. దాని గుట్టుమట్టు కనిపెట్టాను. ఇన్నాళ్లకి దొరికింది. దాన్ని జైల్లో పెట్టేస్తారు కదూ?"

"అబద్ధపు సాక్ష్యం చెప్పినందుకు తప్పకుండా శిక్ష పడుతుంది"

"తోసేయండి దాన్ని. జైల్లో పెట్టయండి. శని విరగడైపోతుంది. అవునుబాబూ... నా డబ్బేదీ?"

మారుమాట్టాడకుండా మేహెర్న్ డబ్బు బల్లమీద పెట్టేసి బయటకు నడిచేడు.

అక్కణ్నుంచి సరాసరి లయన్ సినిమాహాలుకి వెళ్లాడు. రొమైన్ ఫోటోను హాలు మేనేజరు గుర్తుపట్టాడు. హత్య జరిగిన రోజు రాత్రి ఎవరో మగాడితో ఆమె సినిమాకొచ్చిన వాట వాస్తవమే. కూడా వచ్చినతన్ని మేనేజరు చూడలేదు. కానీ ఈమె ఆఫీసులోకొచ్చి టిక్కెట్లడిగింది. సినిమా గురించి వివరాలడిగింది కూడా. సినిమా ఆఖరయ్యేవరకూ వాళ్లిద్దరూ ఉన్నారు.

మేహెర్న్కి ఆత్మవిశ్వాసం పెరిగింది. రొమైన్ సాక్ష్యం పచ్చి అబద్ధమని తను సులభంగా నిరూపించగలడు. కానీ లియోనార్డ్పై ఆమె ద్వేషానికి కారణమేమయి ఉంటుందో అతనికి అంతుపట్టలేదు. భార్య తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్తోందని విని అతను నిర్ఘాంతపోయాడు. ముందు నమ్మలేదు. తరువాత గుడ్లప్పగించి విన్నాడు. అతనికి కారణం తెలిసే ఉంటుంది. కానీ మిగతా వాళ్లకు చెప్పే ఉద్దేశ్యం లేదతనికి. భార్యాభర్తల మధ్య రహస్యం వాళ్ల మధ్యనే ఉండిపోతుంది.

లియోనార్డ్ కేసు చాలామందిని ఆకర్షించింది. అతని అందం, ఆరోపించబడిన నేరం, రొమైన్ సాక్ష్యం - జనాల్లో ఉత్సుకతను పెంచాయి. పత్రికల్లో రొమైన్ ఫోటోలు, ఆమె గురించిన కట్టుకథలు చాలా రాసాగాయి.

మేహెర్న్ క్రాస్ ఎగ్జామినేషన్ ఆరంభమయింది. జేనెట్ తన పాత కథే వినిపించినా, ఎమిలీ, లియోనార్డ్ మధ్య సంబంధం ఎటువంటిదీ అన్న విషయంపై కొంత ఆమెను కంగారు పెట్టగలిగాడు

లాయరు. తను ముందు చెప్పినదాన్ని తనే ఖండించిందామె ఒకటి రెండుసార్లు. ఎమిలీతో మాట్లాడిన మగగొంతు వోల్‌దే అని ఖచ్చితంగా చెప్పలేమని కూడా ఆమెచేత ఒప్పించగలిగేడు లాయరు. లియొనార్డ్ మీద అసూయ, అయిష్టం ఆమెకున్నాయన్న విషయాన్ని జడ్జి దృష్టికి తీసుకెళ్లగలిగేడు డిఫెన్సు లాయరు.

తదుపరి సాక్షి రొమైన్.

"గత మూడేళ్లుగా ముద్దాయితో ఉంటూ, భార్యగా చలామణీ అయిపోతున్నావుకదూ?" అన్నాడు డిఫెన్స్ లాయరు కటువుగా. ఆమె కళ్లెత్తి ముద్దాయి కళ్లలోకి చూసిందొకసారి. ఆమె మనస్సులో ఏముందో ఎవరూ చెప్పలేరు.

"అవును"

ప్రశ్నలారంభమయ్యాయి. రొమైన్ ఇంతకుముందు చెప్పినవే చెప్పుకొచ్చింది. ఆ రాత్రి ముద్దాయి ఇనపకమ్మీ తనవెంట తీసుకెళ్లాడు. పదీ ఇరవైకి తిరిగివచ్చాడు. ముసలావిడను చంపినట్టు తనతో చెప్పాడు. చొక్కా చివర్లు రక్తంతో తడిసివున్నాయి. కిచెన్ స్టవ్ మంటలో వాటిని కాల్చేశాడు. ఎవరికైనా చెబితే తననూ చంపేస్తానని బెదిరించాడు.

ఆమె కథనం ముందుకు సాగినకొద్దీ కోర్టులో ఉన్న యావన్మందీ చలించిపోయారు. ముద్దాయిమీద ఉన్న కాసింత జాలీ కూడా ఇగిరిపోయింది. ముద్దాయి కూడా ఆ విషయం గ్రహించినవాడిలా నిస్సహాయంగా చతికిలపడిపోయాడు.

ప్రాసిక్యూషన్ లాయర్ రొమైన్‌ను కాస్త అదుపులో పెట్టడానికి చూసినమాట వాస్తవం. ఆమె కసితో సాక్ష్యమిస్తోం దనిపించకూడదని అతని తాపత్రయం.

డిఫెన్సు లాయరు లేచాడు. "నువ్వు కట్టుకథలల్లుతున్నావనీ, నువ్వు చెప్పే పదీ ఇరవైకి నువ్వు ఇంట్లోనే లేవనీ, ఇంకొకడితో ప్రేమాయణం సాగిస్తూ లియొనార్డ్‌ను ఉరికంబానికి పంపడానికి ప్లాను సిద్ధం చేశావనీ నేనంటున్నాను. దీనికేమంటావ్?" అన్నాడు.

"ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలు" అంది రొమైన్.

అప్పుడు బయటకొచ్చింది మేహెర్న్ సంపాదించిన ఉత్తరం. దాన్ని కోర్టులో బిగ్గరగా చదివి వినిపించారు.

"నా ప్రియమైన మేక్స్, రొట్టెవిరిగి నేతిలో పడింది. వాణ్ణి అరెస్టు చేశారు. హత్య కేసు. సన్నాసి, దోమను కూడా చంపలేని శుంఠపై హత్యానేరం. పగ తీర్చుకోవడానికి ఎట్టకేలకు నాకు ఛాన్సు దొరికింది. ఆ రోజు రాత్రి రక్తంతో తడిసిన బట్టలతో ఇంటికొచ్చాడని సాక్ష్యమిస్తాను. దెబ్బకి సఫా. ఉరికంబంమీద నన్నే తలుచుకోనీ. ఆపైన మనిద్దరం ఏకమై...!"

చేతిరాత రొమైన్‌దా కాదా అని పరీక్షించడానికి నిపుణులను పిలవబోయారు. కానీ ఆ అవసరం పడలేదు. ఉత్తరం బయటపడగానే రొమైన్ బెదిరిపోయింది. తప్పు ఒప్పేసుకుంది. లియొనార్డ్ తొమ్మిదీ ఇరవైకే ఇంటికి తిరిగి వచ్చేశాడనీ తనే మిగతా విషయాలన్నీ కల్పించాననీ చెప్పేసింది.

రొమైన్ సాక్ష్యం పటాపంచలయిపోవడంతో ప్రాసిక్యూషన్ కేసు వీగిపోయింది. డిఫెన్సు లాయర్ తక్కిన సాక్షులను కూడా పిలిచాడు. ముద్దాయి కూడా జంకుగొంకు లేకుండా నిబ్బరంగా తను మేహెర్న్‌కు చెప్పిందే చెప్పాడు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో కూడా తొణకలేదు.

ప్రాసిక్యూషన్ నిస్సహాయంగా మిగిలిపోయింది. జడ్జిగారు ముద్దాయిని నిర్దోషని గట్టిగా అనలేదు. జ్యూరీ సభ్యులు కొద్దిసేపు చర్చల తర్వాత తమ నిర్ణయాన్ని ప్రకటించారు.

"ముద్దాయి నిర్దోషని మా అభిప్రాయం"

లియొనార్డ్ దగ్గరకు వెళ్లి అభినందించడానికి మేహెర్న్ తన సీటులోంచి లేచాడు. అతని చుట్టూ జనం ఉండడంతో కాస్సేపు ఆగవలసివచ్చింది. కళ్లజోడు తీసి తుడుచుకుంటూ ఉలిక్కిపడ్డాడు. క్రితంరోజు రాత్రి వాళ్లావిడ అంది. "మీకు ఈ కళ్లజోడు తీసి తుడుచుకోవడం అలవాటుగా మారిపోతోంది జాగ్రత్త" అని. చిత్రం తెలియకుండా మనుష్యులు అలవాట్లకు బానిసలయిపోతూంటారు.

మొత్తంమీద కేసు ముగిసింది. భలే కేసు. ఆ ముసల్ది మహానుభావురాలు. ఉత్తరం ఇచ్చి పుణ్యం కట్టుకుంది. రొమైన్ కూడా భలే మనిషి. ఆ రోజు తన ఇంట్లో ఆమె పాలిపోయి కనబడింది. ఇప్పుడు కోర్టులో చెలరేగి ఉంది. పొడుగ్గా, దార్షికంగా చెయ్యి ఊపుతూ కుడిచేతి గుప్పిలి మూస్తూ, తెరుస్తూ, మూస్తూ.

తనకి అదొక అలవాటేమో... తెలియకుండానే పట్టుబడిందేమో... ఈ అలవాటు మరొకరెవరి దగ్గరో కూడా చూశాడు తను. ఎవరోగానీ...

తల విదిలించాడు మేహెర్న్.

ఈమధ్యే... ఎవరో...

ఎవరో గుర్తొచ్చేసరికి... అతనికి ఊపిరి ఆగినంత పనయింది. షారెంట్స్‌లో ఉన్న ముసలిది. ఆమెకూ ఈ అలవాటు ఉంది. కానీ... కానీ... ఇది సంభవమా? ఇద్దరూ ఒకరేనా? అబ్బే...! ఎందుకు కాకూడదు? రొమైన్ వియన్నాలో నాటకాలు వేస్తూండేదిగా.

ఎవరో వచ్చి 'లియొనార్డ్‌ను అభినందించారా?' అంటున్నారు. మేహెర్న్ మనస్సులో ఉన్నదొకటే. రొమైన్‌ని చూడాలి. ఏకాంతంగా, త్వరగా.

కొన్ని రోజుల తర్వాత ఎమిలీ ఆస్తి లియొనార్డ్‌కి చేరి, శిక్షాకాలం పూర్తి చేసుకొని వచ్చిన రొమైన్‌ను చేరదీసిన తర్వాత మేహెర్న్ ఆమెను కలవగలిగేడు. కలిసి తననుకున్నదంతా చెప్పేడు.

"అయితే మీరు గ్రహించారన్నమాట. మేకప్‌లో మొహాన్ని అలా మార్చేయగలిగేను. గదిలో పొగవల్ల మీరు మేకప్‌ను కనిపెట్టలేకపోయారు."

"కానీ ఈ వేషాలన్నీ ఎందుకు?"

"చూడండి సార్! లియొనార్డ్‌ను రక్షించుకోవాలని నా తాపత్రయం. 'నా మొగుడంటే నాకు చచ్చేటంత ఇష్టం. అతను నిర్దోషి అని చెప్తే నా సాక్ష్యానికి వీలువుంటుందా? ఆ విషయం మీరే చెప్పారు కూడా! ఒక నటీమణిగా జనాల మనస్తత్వం నాకు బాగా తెలుసు. అతను నిర్దోషి అని బలవంతంగా నా దగ్గర్నుండి రాబడితేనే ఆ సాక్ష్యానికి విలువ ఉంటుంది. అదీ ఒక దొంగసాక్షిగా తప్పు ఒప్పుకుంటున్నట్టుగా చెబితే ముద్దాయిపట్ల జాలి పెరుగుతుంది. నేను ఎంత చెడ్డదానిగా నిరూపించబడితే, అతను అంత ఉన్నతుడిగా భావింపబడతాడు"

"అదా సంగతి, మరి నీ ప్రేమలేఖలు... అవన్నీ కల్పితమేనా! అన్ని ఎందుకు?"

"ఒకటే చూపిస్తే మీరు నమ్మి ఉండేవారు కాదు. గట్టిగా వాదించడానికి ముందు మిమ్మల్ని నమ్మించడం ముఖ్యంకదా"

"మరి మేక్స్?"

"అలాటి వ్యక్తి ఎవరూ లేదు సార్. ఆవేళ సినిమా హాల్‌కి నాతో వచ్చినది మా ఫ్యామిలీ ఫ్రెండు"

మేహెర్న్‌కు చికాకు వేసింది, తను వెర్రివాణ్ణి చేసి ఆడించినందుకు. "ఇంత డ్రామా ఎందుకు? మామూలు పద్ధతుల్లోనే అతన్ని విడిపించేవాళ్లంకదా"

"ఏమో ఎవరికి తెలుసు? అతను నిర్దోషని మీరు గట్టిగా నమ్మకపోతే మీ వాదనలో బలం ఉండదుకదా?"

"ఎందుకు నమ్మను? అతను నిర్దోషేకదా! ఆ విషయం నీకు మాత్రం తెలియదా ?"

రొమైన్ నవ్వింది. "సార్ మీకసలు విషయం తెలియదు. నాకు తెలుసు, చంపిన లియొనార్డ్‌కి తెలుసు! చచ్చిన ఎమిలీకి తెలుసు.

●

(అగాథా క్రిస్టీ రాసిన 'ద విట్నెస్ ఫర్ ప్రాసిక్యూషన్'కు అనువాదం,
విపుల మార్చి 1996లో ప్రచురితం)

— ఎమ్బీయస్ ప్రసాద్